**Andhra Jyothi**

# రియల్టీలో 7.5 కోట్ల ఉద్యోగాలు

## 2020నాటికి లభిస్తాయన్న కెపిఎంజి నివేదిక

న్యూఢిల్లీ : దేశీయ రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం వచ్చే ఆరేళ్లకాలంలో ఉపాధి కల్పనలో కీలక భూమిక పోషించనున్నట్టు కెపిఎంజి ఇండియా నివేదిక అంచనా వేస్తోంది. 2022 నాటికి ఈ రంగం 7.5 కోట్ల ఉద్యోగాలను కల్పించనున్నట్టు పేర్కొంది. ఫలితంగా దేశంలో అత్యధికంగా ఉద్యోగాలు కల్పించిన రంగంగా ఆవిర్భవించనుందని తెలిపింది. 2030నాటికి భారత రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం అంతర్జాతీయంగా మూడో అతిపెద్ద రంగంగా మారనుందని, అప్పటికి దేశ జిడిపిలో ఈ రంగం వాటా 15 శాతానికి పైగా ఉంటుందని కెపిఎంజి వెల్లడించింది. 2030నాటికి నిర్మాణరంగ మార్కెట్ పరిమాణం లక్ష కోట్ల డాలర్లను దాటనుందని కూడా పేర్కొం ది. పట్టణీకరణ, రియల్ ఎస్టేట్ రంగం ఎదుర్కొంటున్న కీలక సవాళ్లను పరిష్కరించేందుకు గత రెండేళ్లకాలంలో ప్రభుత్వం విడుదల చేసిన వివిధ పథకాలకు సంబంధించిన సమాచారంతో రూపొందించిన నివేదికను కెపిఎంజి ఇండియా, నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నారెడ్కో) విడుదల చేశాయి.



## 2030నాటికి పట్టణ జనాభా 58 కోట్లు

2015 సంవత్సరంలో పట్టణ జనాబా 42 కోట్లుగా ఉంది. 2030నాటికి ఈ జనాబా 40 శాతం మేర పెరిగి 58 కోట్లను అధిగమించే అవకాశం ఉందని నివేదిక అంచనా వేస్తోంది. జనాబా భారీ స్థాయిలో పెరుగుతుందన్న అంచనాలతో ప్రభుత్వం స్మార్ట్‌సిటీలు, అందరికీ ఇళ్లు, అమృత్, హృదయ్ వంటి పథకాలను ప్రారంభించినట్టు పేర్కొంది. వీటితోపాటు రియల్ ఎస్టేట్ చట్టం, రీట్స్, జిఎస్‌టి వంటి విధానాలను కూడా తెచ్చినట్టు వెల్లడించింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అందరికీ గృహాలు కల్పించాలంటే 2022 నాటికి 11 కోట్ల వరకు గృహాల అవసరం ఉంటుందని నివేదిక పేర్కొంది. ఇప్పటికే ఆ కోట్ల గృహాల కొరత ఉందని, ఇందులో పట్టణ ప్రాంతాల్లో రెండు కోట్ల కొరత ఉందని పేర్కొంది.

## 2,400 కోట్ల డాలర్ల ఎఫ్‌డిఐ

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డిఐ) ఆకర్షించడంలో రియల్టీ రంగం ముందంజలో ఉందని నివేదిక పేర్కొంది. 2000 సంవత్సరం నుంచి 2015 వరకు రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం 2400 కోట్ల డాలర్లకు పైగా ఎఫ్‌డిఐని ఆకర్షించింది. అందరికీ గృహాలను కల్పించాలంటే 2022నాటికి 2 లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడుల అవసరం ఉంటుందని నివేదిక అంచనా వేసింది. రీట్స్ (రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్) పరిధిలోకి వచ్చే వాణిజ్య ఆఫీసు ప్రదేశం 40 కోట్ల చదరపు అడుగుల వరకు ఉండవచ్చని, దీని విలువ 5,000 కోట్ల డాలర్లకు పైగా ఉంటుందని పేర్కొంది. ప్రస్తుతం చాలా భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపింది. రోడ్ల నిర్మాణానికి సంబంధించి 6.5 లక్షల కోట్ల డాలర్ల విలువైన 432 ప్రాజెక్టులు, 6.5 లక్షల కోట్ల డాలర్ల విలువైన 400 రైల్వే ప్రాజెక్టులు, 67000 కోట్ల డాలర్ల విలువైన 70 ఎయిర్‌పోర్ట్, 75 పోర్ట్ ప్రాజెక్టులు (55,100 కోట్ల డాలర్లు) ఉన్నట్టు పేర్కొంది. పట్టణాల్లో జీవించేందుకు ప్రజలు అధిక ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో నిర్మాణ రంగంలోని దేశీ, విదేశీ కంపెనీలకు అవకాశాలు లభించనున్నాయని నివేదిక వెల్లడించింది. రియల్టీ రంగంతో సంబంధం ఉన్న డిజైనింగ్, డెవలప్‌మెంట్, నిర్మాణం, ఫైనాన్స్‌కు మంచి అవకాశాలు లభిస్తాయని పేర్కొంది.